# పిచ్చిగీతలు

ఎస్. నూర్ అహ్మద్

ఉదయభానుని కిరణాలు ఇంకా పదునెక్కని ఉదయపు వేళలో డిసెంబర్ మాసాంతపు చలిగాలులు లోకాన్ని వణికించేస్తున్నా, పట్టణవాసులు అప్పటికే హడావుడి పడిపోతూ తమ వాహనాల్ని రోడ్లపై ముందుకు ఉరికిస్తున్నారు. నును వెచ్చని లేత ఎండలు లోకంపై పల్చగా పరుచుకుంటున్న కొద్దీ రోడ్లలో రద్దీ అధికమవుతూ ఉంది. ఆ సమయానికే ప్రభుత్వాసుపత్రిలోనూ రోగుల సణుగుళ్లు మొదలైయ్యాయి.

చుట్టూ సువిశాలమైన ప్రహారీగోడలతో, పచ్చటి చెట్లతో పవిత్రంగా కనిపించే ఆ ప్రభుత్వాసుపత్రి లోగుట్టు లోపలికి వెళితేగానీ అర్థం కాదు. ఆస్పత్రి లోపలున్న కుళ్లుకు నిదర్శనంగా వార్డులన్నీ కంపుకొడ్తుంటాయి. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి అవశేషాలని చెబితే సులభంగా నమ్మేసే మంచాలు, శిథిలమైపోయిన పరుపులు, వాటిపై పడుకున్న రోగులు అటూ, ఇటూ కదిలినప్పుడల్లా కిర్రు మంటూ మూల్గుతుంటాయి. గోడలపై దట్టంగా పేరుకుపోయిన ధూళి, బూజు, ఎప్పుడో మాడిపోయిన వెలగని బల్బులు, ఛీత్కారాలు, చీదరింపులు ఆ వార్డుల్లో ఉన్న రోగుల మనసుల్లో బ్రతకాలనే కోరికను కాలరాస్తాయి. అంతులేని వైరాగ్యాన్ని ప్రబోధిస్తుంటాయి. ఆ వార్డులలో స్థలం చాలకపోగా ఆస్పత్రి ఆవరణలోని చెట్ల కింద కూడా అనేకమంది రోగులు నేలపై బెడ్ షీట్లు, చాపలు పరుచుకొని పడుకొని ఉన్నారు.

"ఇప్పుడెలా ఉందయ్యా..." నర్సమ్మ అడిగింది తిరుమలప్పని.

నేలపై పడుకున్న తిరుమలప్ప నీరసంగా కళ్లు విప్పాడు.

తన పక్కనే రాత్రి తెల్లవార్లూ కూర్చొని జాగారం చేసిన భార్య ముఖంలోని ఆతృత, ఆదుర్దా అతనికి స్పష్టంగా కన్పించడంతో తనకు ఫరవాలేదన్నట్లు తలాడించాడు.

తిరుమలప్ప కొడుకు ఐదేళ్ల సిద్ధ తండ్రి పక్కనే కూర్చొని తనకు దొరికిన ప్లాస్టిక్ పెన్నుతో చేతికి దొరికిన కాగితాలు, ఖాళీ మందుల అట్టపెట్టెలపైన పిచ్చి గీతలు గీస్తూ కూర్చున్నాడు.

వీళ్లకు కాస్త దూరంగా ఎడ్లబండి కాడిమానుని నేలకు వాల్చి అక్కడే ఎద్దుల్ని కట్టేసి రాత్రంతా ఆ బండి కిందనే నిద్రించిన తిరుమలప్ప తమ్ముడు క్రిష్టప్ప బండి దగ్గర్నుండి లేచి వెళ్లి దగ్గర్లోనే ఉన్న చిన్న హొటల్ నుండి టీలు తెచ్చి వదినకు, సిద్ధకు అందించాడు.

"ఇప్పుడెట్లుందన్నా..." తిరుమలప్పని చూస్తూ అడిగాడు క్రిష్టప్ప.



ఆ ప్రశ్నకు మగత నిద్రలో ఉన్న తిరుమలప్ప జవాబు చెప్పకపోయినా నర్సమ్మే బదులు చెప్పింది.

"ఇప్పుడు బాగానే ఉండాడు, మొఖంలో కూడా కాసింత కళ వచ్చిందిలేదా?" అని కిష్టప్పను అడిగిం దామె. రాత్రంతా భర్త పక్కనే నిద్ర కాసిన నర్సమ్మ కళ్లు ఎర్రగా మండిపోతున్న విషయం గమనించి -

"ఒదినా! నువ్వెళ్లి కాసేపు బండ్లో పడుకో, నేను అన్నకాడే ఉంటాను" అన్నాడు కిష్టప్ప.

దాని కామె తాను నిద్రపోనని తల అడ్డంగా ఊపింది.

ఆ తర్వాత పదినా తాగి పెట్టిన టీ గ్లాసును, సిద్ధ నగం తాగి క్రిందకి ఒలకబోసిన టీ గ్లాసును చేతిలోకి తీసుకొని "ఒదినా నేను ఊళ్లో కెళ్లి రెడ్డిని కలిసొస్తా" అని చెప్పా డతను.

అతను రెడ్డి దగ్గరికి ఎందుకు వెళుతున్నాడో తెలిసిన నర్సమ్మ అలాగే నంటూ తల ఊపింది.

*** *** ***

ఎద్దుల్ని విప్పి, కాడిమాను పైకి లేపి వాటి మెడలపై పెట్టి ఎద్దుల్ని కాడిమాను తాడుతో కలిపి కట్టేశాక బండిపైకి ఎక్కి ముందుకు కదిలించబోయాడు. అంతలోనే అక్కడికి పరిగెత్తు కొచ్చిన సిద్ధ కిష్టప్పను ఆపేశాడు.

"చిన్నాన్నా నిన్ను డాక్టర్ రమ్మంటున్నాడు." వచ్చీరాని మాటలతో చెప్పా డతను.

ఆ మాటతో బండి నుండి కిందికి దిగి అన్న వదిన లున్న చోటికి వచ్చాడు కిష్టప్ప.

తిరుమలప్ప పడుకున్న చోట నిలబ డ్డతను తెల్ల బట్టల్లో ఉన్నాడు కాబట్టి డాక్టరో, కాంపౌండరో తెలీకనే దండం పెట్టా డతను.

అతను నువ్విలారా అన్నట్టు సైగ చేసి కాస్త ముందుకు నడిచాడు.

"మీ అన్న పరిస్థితి ఏం సరిగా లేదయ్యా... మనిషి చాలా నీరసంగా ఉన్నాడు. ఈ రోగానికి తట్టుకో గలడో లేదో అనిపిస్తోంది." తన వెనుకే వచ్చిన కిష్టప్పతో చెప్పా డతను.

ఆ మాటలువినగానే అతనికి భయంతో గుండె వేగం పెరుగుతుండగా సన్నగా వణుకుతూ అన్నా డతను.

"అయ్యా! మా అన్నను నువ్వే రక్షించాలి. అడి ప్రాణం నువ్వే కాపాడాలి..." అని.

"నువ్వేం భయపడకు, మీ అన్నను నేను కాపాడుతాన్లే." భరోసా ఇచ్చాడు అవతలి వ్యక్తి.


ఆ మాటతో అప్రయత్నంగా అతనికి చేతులు జోడించాడు కిష్టప్ప.

"ఇదో నువ్వెళ్లి ఈ మందు సీసాలు తీసుకురా, వీటిని మీ అన్నకు ఎక్కించామంటే మధ్యాన్నానికి ఆయన లేచి కూచుంటాడు..." అంటూ ఓ చీటీ రాసి అతని చేతిలో పెట్టా డతను.

ఆ చీటీని అందుకొని సంశయిస్తూనే అడిగాడు కిష్టప్ప.

"అయ్యా! ఈ మందుల కెంత అవుతుందని."

"ఓ రెం డొందలు కావచ్చు." బదులిచ్చా డతను.




ఆ మాట విని ముందుకు కదలబోయిన క్రిష్టప్పను వారిస్తూ అన్నా డతను.

"ఇదిగో చూడూ! ఈ మందుల్ని మన ఆసుపత్రి పక్క నున్న షాపులోనే కొను, అక్కడ తప్ప ఇంకెక్కడా మంచి మందులు దొరకవు. ఆ మందులు తెచ్చాక నా చేతికే తెచ్చివ్వు" అని.

క్రిష్టప్ప సరేనంటూ తలూపి ముందుకు నడిచాడు.

*** *** ***

ఎద్దుల బండ్లో పట్టణం పొలిమేరలు దాటాక ఎద్దులు మెల్లగా నడుస్తుంటే ఆలోచనలో పడ్డాడు క్రిష్టప్ప. తన అన్న తిరుమలప్పకు రెండ్రోజులుగా వాంతులూ, విరోచనాలు మొదలైయ్యాయి. ఆ రోగాన్ని నాటుమందులతో నయం చేయాలని ప్రయత్నించే లోపలే ఆ చుట్టు పక్కల పల్లెల్లో ఇంకా కొంతమంది అదే రకం రోగంతో మృతి చెందడంతో రాత్రికి రాత్రే అన్నా వదినెలను బండ్లో పిలుచుకొని వచ్చి పట్నంలోని ఆస్పత్రిలో చేర్చాడు.

పేరుకు మాత్రం ఉచిత వైద్యం అందించే ఆ ఆసుపత్రిలో చెట్టు కిందకు చేర్చి నూది మందులూ, గ్లూకోజు నీళ్లూ ఎక్కించడానికి ఊళ్లో రెడ్డి దగ్గర్నుండి అప్పు తెచ్చి మూడొందలూ అప్పుడే అయిపోయాయి. అందుకే రెడ్డి దగ్గరే మరో నూర్రూపాయలు అప్పు తెస్తామని బయల్దేరేలోపలే డాక్టరొచ్చి ఈ మందుల గురించి చెప్పాడు. కాబట్టి తనకు ఎంత లేదన్నా మరో మూ డొందలు కావాలి. కానీ రెడ్డి ఒక్క పైసా కూడా ఇవ్వడని నిశ్చితంగా తేలిపోయాక ఏం చేయాలా? అని ఆలోచిస్తూ ఇంటికి వచ్చాడు క్రిష్టప్ప.

చేతులు నులుముకుంటూ ఇంటికి వచ్చిన కిష్టప్పను విషయ మేమిటో అడిగి తెలుసుకుంది. అతని తల్లి రాజమ్మ.

అంతా విన్నాక క్షణ కాలంపాటు ఆలోచించిన రాజమ్మ తన కాళ్లల్లో ఉన్న వెండి తోడాలు, చైనులు తీసి అతని చేతిలో పెట్టింది.

ఆమె ఎప్పుడో కొన్ని దశాబ్దాల కిందట కాపురానికి వచ్చినప్పుడు అత్తింట్లో వారసత్వంగా వచ్చిన ఆభరణా లవి. అందుకే వాటిని ప్రాణప్రదంగా చూసుకుం దామె. ఎన్ని కష్టా లొచ్చినా ఏనాడూ వాటి జోలికి వెళ్లలేదు. అయితే ఇప్పుడు కన్న కొడుకు గండం గట్టెక్కించడానికి వాటిని తీసిచ్చింది.

ఆ విషయం క్రిష్టప్పకు కూడా తెలుసు.

అయినా గత్యంతరం లేదని తెలిసి వాటిని అందుకొని వస్తున్నప్పుడు క్రిష్టప్ప కళ్లలో నీళ్లు పొంగి వచ్చాయి. కానీ ఏం చేయలేని నిస్సహాయతతో వాటిని తీసుకెళ్లి ఒక వ్యాపారి ముందు పెట్టా డతను.

క్రిష్టప్ప కుటుంబం ఉంటున్న గ్రామానికి బాగా పరిచయమైన వ్యాపారస్తుడే అతను. అయినా ఎప్పటిలాగానే వెండి ధర పడిపోయిందని, అసలు వాటిని కొనదల్చుకోలేదని, కేవలం అతని మీద జాలితో దయ తల్చి మాత్రమే కొంటున్నాననే ధోరణిలో మాట్లాడుతూ వాటిని ఐదొందల రూపాయలకు కొన్నాడు.

అయితే కిష్టప్పకు తెలుసు మళ్లీ వాటిని అతని దగ్గర్నుండే కొనాలనుకున్నా కనీసం పదిహేను వందలైనా లేనిదే వాటిని అమ్మడని.

నగలు అమ్మగా వచ్చిన డబ్బుతో మందుల షాపులోకి వెళ్లి చీటీ ఇచ్చి రెండు సెలైన్ సీసాలు తీసుకున్నా డతను.

అత నిచ్చిన చీటీ పూర్తిగా చదవకుండానే అతని కోసమే అన్నట్టు టేబుల్పై సిద్ధంగా పెట్టుకున్న బాటిళ్లను అతనికి అందించిన షాపతను రెండు వందల పైచిలుకు మొత్తం తీసుకున్నాడు.

*** *** ***

క్రిష్టప్ప తాను తెచ్చిన మందుల సీసాల్ని తీసుకొని నరాసరి తన అన్న ఉన్న చోటికే వచ్చాడు. అయితే అతనికి ఆ మందులు రాసిచ్చిన డాక్టర్ ఎక్కడా కన్పించకపోవడంతో ఆ సీసాల్ని అక్కడే పెట్టి, వాటిని చూస్తుండమని వదినకు చెప్పి డాక్టర్ని వెతుకుతూ వెళ్లా డతను.

ఎక్కడో బిజీగా ఉన్న డాక్టర్ను చూసి అతను తిరిగి వెనక్కి వచ్చేసరికి ఆ సీసాలపై ఉన్న కాగితాలపై సిద్ధ తన వద్ద ఉన్న పెన్నుతో పిచ్చి గీతలు గీస్తూ కన్పించాడు. సిద్ధ చేతిలో ఉన్న

పెన్ను ఇంకు కక్కుతుండటంతో అతని చేతికి కూడా ఇంకు అంటుకుంది కాబోలు. ఆ సీసా లేబిల్ కాగితాలపై ఇంకు మరకలు. కూడా పడ్డాయి.

దాంతో అది సీసాలు వాడి చేతి నుండి లాక్కున్న కిష్టప్ప ఆవేశం పట్టలేక వాడికి ఒక్కటి తగిలించాడు.

అతని ఆవేశం అర్థం చేసుకున్న నర్సమ్మ కిష్టప్పను ఏమీ అనకుండా ఏడుస్తున్న సిద్ధను సముదాయించడం మొదలుపెట్టింది. అయినా ఇదేం పట్టనట్లు కిష్టప్ప సీసాలు విసురుగా అందుకొని ఆ డాక్టర్ వద్దకు వెళ్లి వాటిని అందించాడు.

"తెచ్చావా... ఇక మీ అన్న గురించి బెంగే అవసరం లేదు" అన్నా డతను సీసాలు అందుకుంటూ.

క్రిష్టప్ప వెళ్లిపోయాక ఆ సీసాలను వార్డులో పని చేస్తున్న వ్యక్తి చేతికి అందించా డతను.

*** *** ***

**తి**రుమలప్పకు ఉదయం నుండి సాయంత్రం దాకా సెలైన్ ఎక్కించారు. సెలైన్ సీసా వేలాడ దీయడానికి స్టాండు కూడా ఆస్పత్రిలో కరువు కాగా చెట్టు కొమ్మకు పురిదారంతో కట్టి వాటిని ఎక్కించారు.

ప్రతి రెండు, మూడు గంటలకో సారి నర్సు వచ్చి ఆ సీసాలను మార్చి వెళ్లింది. సాయంత్రానికి తిరుమలప్ప కాస్త కోలుకున్నాడు. లేచి కూర్చొనే ఓపిక కూడా వచ్చిం దతనికి.

దాంతో ఎంతో సంతోషించాడు కిష్టప్ప. ఇక ఆస్పత్రి నుండి అన్నను పిల్చుకెళ్లిపోవాలని ఆ విషయం డాక్టర్‌తో చెప్పిరావాలని డాక్టరు ఉండే గదికి వెళ్లా డతను. అక్కడ తాను సీసాలు అందించిన డాక్టరే ఉండటంతో అతనికి విషయం చెప్పి, ఇక తన అన్నను తీసుకెళ్లిపోతానని చెప్పాడతను.

మహాకవి జాషువా వద్దా సారం:
ప్రత్యేక వ్యాసం పద్యాలతో
విశ్వనాథ సత్యనారాయణ కథ
'ఊరి'

డాక్టర్ సరే నన్నాడు.

ఇక ఆ గది నుండి వెనుదిరిగి వచ్చేలోగా కిష్టప్పకు హఠాత్తుగా తాను తెచ్చిచ్చిన సీసాల విషయం గుర్తిచ్చింది. పొద్దున్నుండీ తాను తన అన్న దగ్గరే ఉండగా ఆ సీసాలు ఎక్కించినట్లు కనబడ్లేదు. దాంతో అమాయకంగా తన మనసులోని అనుమానం గురించి చెప్పేశాడు కిష్టప్ప.

అతను చెప్పిన మాట వినగానే డాక్టర్‌కు ఛర్రున కోపం పొంగివచ్చింది.

"ఏందయ్యా నీ అనుమానం! నువ్వు తెచ్చి ఇచ్చిన మందులు మేం తాగే సామానా? మీ అన్నకు ఎక్కించిన మందుల్లోనే వాటినీ కలిపి ఎక్కించాం గనుకే మీ అన్న బ్రతికాడు. లేకపోతే ఈపాటికి శవం తీస్కెళ్లాల్సి ఉండేది తెలుసా?" అని గద్దించా డతను.

దాంతో కిష్టప్ప సంశయం తీరిపోగా అక్కడి నుండి వెనుదిరిగాడు.

"అలగా జనాన్ని అయ్యో అని ఆదరిస్తే ఇలాగే ఉంటుంది." అతను వినేలా వెనుక నుండి తిడుతున్నాడు డాక్టరు.

పాపం, డాక్టర్ని ఆ మందుల గురించి అడిగి బాధ పెట్టానే అనుకుంటూ తనను తాను తిట్టుకుంటూ ఆసుపత్రి నుండి బయల్దేరాడు కిష్టప్ప.

*** *** ***

**త**న అన్నా వదినెలనూ, ఐదేళ్ల సిద్ధడ్నీ బండ్లో కూర్చొబెట్టుకొని బండి తోలుకొస్తున్న క్రిష్టప్పకు ఆస్పత్రి గేట్లో గౌరయ్య ఎదురయ్యాడు.

గౌరయ్య కూడా తమ ఊరివాడే కావడంతోపాటు అతని కొడుక్కి కూడా అతిసార సోకి ఆస్పత్రిలో చేర్పిన విషయం గుర్తొచ్చి ఎడ్ల పగ్గాలు పట్టి అవుతూ అతన్ని పలకరించాడు.

"ఎలా ఉంది గౌరయ్యా నీ కొడుక్కి" అని అడిగాడు క్రిష్టప్ప.

"నిన్నటి కంటే కొంచే నయమే కిష్టా. ఇదో డాక్టర్ ఈ మందులు రాసిచ్చాడు. ఇవి ఎక్కిస్తే త్వరగా బాగైపోతుందట. మీ అన్నకు కూడా ఈ మందులతోనే నయమైందంట కదా!" చేతిలోని సీసాలుచూపుతూ చెప్పాడు గౌరయ్య.

అది నిజమే నన్నాడు క్రిష్టప్ప.

"మీ అన్నకు ఎక్కించింది కూడా ఇలాంటి సీసాలే కదా" అంటూ వాటిని చూడ మన్నట్లుగా క్రిష్టప్పకు అందించా డతను.

వాటిని అందుకొని యథాలాపంగా చూసిన క్రిష్టప్ప నివ్వెరపోయాడు. అవి తన అన్న కోసం డాక్టర్‌కు తెచ్చిచ్చిన సీసాలే. అందుకు సాక్ష్యంగా ఆ సీసాల లేబుల్స్‌పై సిద్ధ పెన్నుతో గీసిన పిచ్చి గీతలు కన్పిస్తున్నాయి.

కానీ కిష్టప్పకు ఆ గీతలు పిచ్చి గీతల్లా కాదు. ఓ సత్యాన్ని మౌనంగానే నివేదిస్తున్న అర్థంకాని బీజాక్షరాల్లాగా కనిపిస్తున్నాయి. ●

